జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948
జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక
హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 104॥ మంగళవారం ॥ 8-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





08 సెప్టెంబర్ 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి ద్వాదశి మ. 2:44 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పుష్యమి సా. 4:38 వరకు తరువాత ఆశ్లేష యోగం పరిఘ రా. 12:35o వరకు కరణం తైతుల మ. 2:44 వరకు గరజి రా. 1:36o వరకు వర్జ్యం తె. 4:41 నుండి ఉ. 6:11 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:22 వరకు రా. 11:03 నుండి రా. 11:50 వరకు రాహుకాలం మ. 3:17 నుండి సా. 4:49 వరకు యమగండం ఉ. 9:10 నుండి ఉ. 10:42 వరకు గుళికాకాలం మ. 12:13 నుండి మ. 1:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు ఉ. 10:40 నుండి మ. 12:09 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# స్పీకర్‌కు సంఘీభావంగా..
# కాంగ్రెస్ నేతల భేటీ

**తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నేతలు**

**స్పీకర్ ఛాంబర్‌లో గడ్డం ప్రసాద్‌ను కలిసిన మంత్రులు**

**చట్టసభల గౌరవాన్ని కాపాడాలని పిలుపు**

**సభాపతికి మద్దతుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**

శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో సభాపతి పట్ల తమ మద్దతును తెలియజేస్తూ, తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చట్టసభల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సమర్థనీయం కాదని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 7: ఈ సందర్భంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను పరామర్శించారు. సభాపతి పదవికి ప్రత్యేక గౌరవం ఉందని, ఆ పదవిని అవమానించే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన చట్టసభల ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని అన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలు చట్టసభల సంప్రదాయాలకు భంగం కలిగించేలా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. రాజకీయ తరువాయి 2 వ పేజీలో..



## స్పీకర్ పై అవమానంపై
## సీఎం ఆగ్రహం

**సభ్యుడిని డిస్మిస్ చేయాలని రేవంత్ డిమాండ్**

**చట్టసభల గౌరవాన్ని కాపాడాలన్న సీఎం**

హైదరాబాద్, సెప్టెంబర్ 7: అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారత చరిత్రలో సభాపతి పదవికి ఇంతటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని తరువాయి 2 వ పేజీలో..

# అధిష్ఠానం చూపు
# సిద్ధార్థ్ వైపే !?

## మేయర్ రేసులో నం.1గా బోండా బిడ్డ

## ఎంపీ కేసినేని చిన్ని అభిప్రాయం కీలకం

స్థానిక సంస్థల ఎన్నికల వేళ విజయవాడ మేయర్ పీఠంపై అధికార కూటమిలో అప్పుడే కసరత్తు మొదలైంది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక నగరంగా ఉన్న విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) మేయర్ పదవిని దక్కించుకునేందుకు టీడీపీలో పలువురు నేతలు, వారి కుటుంబ సభ్యులు, వర్గీయులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



విజయవాడ: మేయర్ అభ్యర్థిత్వం కోసం 18 మందికి పైగా ఆశావహులు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి తమ పేర్లను పరిశీలించాలని కోరినట్లు ప్రచారం సాగుతోంది. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన నుంచి కూడా కొందరి పేర్లు వినిపిస్తున్నప్పటికీ.. సీట్ల సర్దుబాటు, స్థానిక రాజకీయ సమీకరణాల ఆధారంగా మేయర్ పదవి ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం విజయవాడ రాజకీయ వర్గాల్లో ప్రధానంగా మూడు వర్గాలకు చెందిన పేర్లు వినిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే తరువాయి 2 వ పేజీలో..



# ప్రతి ఎకరాకు
# నీరందించడమే లక్ష్యం

**'వాటర్ మ్యాన్'గా గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్న సీఎం**

**కూటమి ఐక్యత, కార్యకర్తల పాత్రపై పార్టీ నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం**

అమరావతి, సెప్టెంబర్ 7: రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల 'లీడర్‌షిప్ తరువాయి 2 వ పేజీలో..

# వర్షాకాల సమావేశాలపై బీఏసీ సమావేశం

**స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన భేటీ.. సమావేశాల నిర్వహణ, అజెండాపై చర్చ**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు సభ్యుల హాజరు**



హైదరాబాద్, సెప్టెంబర్ 07: తెలంగాణ రాష్ట్ర వర్షాకాల శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం సోమవారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రానున్న సమావేశాల నిర్వహణ, సభా కార్యక్రమాల రూపకల్పన, చర్చలకు కేటాయించే

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ గడువు పొడిగింపు



హైదరాబాద్, సెప్టెంబర్ 07: తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి గడువు పొడిగించింది. ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలు, సవరణల కోసం దరఖాస్తులు సమర్పించేందు కు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియకు మరింత సమయం లభించింది. ఇంతకుముందు ఎన్నికల సంఘం ప్రకటించిన పొడిగించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమంలో



## అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల ఆగ్రహం

**అసెంబ్లీ చరిత్రలో బ్లాక్ డేగా బీఆర్ఎస్ వ్యాఖ్యలు**

**చీర లాగారని ఆరోపించిన సునీతా లక్ష్మారెడ్డి**

**సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**మహిళల గౌరవానికి అవమానమని విమర్శలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 7: అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద జరిగిన ఘటనపై బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధులకు అవమానం జరిగిందని ఆరోపించారు. శాసనసభ చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ చూడలేదని, ఈ తరువాయి 2 వ పేజీలో..

## నేటి రాశి ఫలాలు

**మేషం:** దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన పనులు అనుకూలిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు.

**వృషభం:** కుటుంబ పెద్దలతో ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

**మిధునం:** వాహన అనుకూలత కలుగుతుంది. ప్రముఖుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి.నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. సంఘంలో పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి.

**కర్కాటకం:** నిరుద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి.

**సింహం:** ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితులు, మిత్రుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి.

**కన్య:** ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. బంధువులతో స్వల్ప విభేదాలు తప్పవు. సహనంతో కానీ కొన్ని పనులు పూర్తి కావు. వ్యాపారాలు, ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి.

**తుల:** ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. గృహమునకు చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది.

**వృశ్చికం:** ఆర్థిక పరంగా ఒత్తిడులు తప్పవు. కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ విషయాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం తప్పదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. బంధు మిత్రులతో అకారణంగా వివాదాలు కలుగుతాయి.

**ధనస్సు:** వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

**మకరం:** చేపట్టిన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు.

**కుంభం:** దీర్ఘకాలిక ఋణాలు నుండి బయటపడగలుగుతారు. చేపట్టిన వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.



# సిద్ధార్థ్ వైపే అధిష్ఠానం చూపు!?

బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు బోండా సిద్ధార్థ పేరు ఒకవైపు బలంగా ప్రచారంలో ఉంది. మరోవైపు టీడీపీ అధికార ప్రతినిధిగా గతంలో చురుకైన పాత్ర పోషించిన, ప్రస్తుతం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేరు వినిపిస్తోంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వర్గానికి చెందిన అభ్యర్థుల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విజయవాడ నగర పాలక సంస్థ పరిధి విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాలతో ముడిపడి ఉండటంతో మేయర్ ఎంపికలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని అభిప్రాయానికి ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తుది నిర్ణయం అధిష్ఠానానిదే అయినప్పటికీ స్థానిక రాజకీయ పరిస్థితులు, నేతల బలాబలాలు, కూటమి సమీకరణాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### పట్టాభిరామ్ వర్సెస్ సిద్ధార్థ

మేయర్ రేసులో ప్రస్తుతం బోండా సిద్ధార్థ, కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్లపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. పట్టాభిరామ్ గత ఐదేళ్లలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తరఫున టీవీ చర్చలు, రాజకీయ కార్యక్రమాల్లో పార్టీ వాణిని బలంగా వినిపించారు. ఈ క్రమంలో ఆయనపై కేసులు, అరెస్టులు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే ప్రస్తుతం ఆయనకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఉండటంతో మరో కీలక పదవి ఇచ్చే విషయంలో పార్టీ ఎలా నిర్ణయం తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు బోండా సిద్ధార్థ పేరు కూడా వేగంగా ముందుకొస్తోంది. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఆయన.. తండ్రి బోండా ఉమామహేశ్వరరావు రాజకీయ ప్రస్థానాన్ని దగ్గరగా చూస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని అనుచరులు చెబుతున్నారు. నగరాభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ఆయనకు అవగాహన ఉందని ప్రచారం జరుగుతోంది.

### అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ

బోండా ఉమామహేశ్వరరావుకు ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిపదవి దక్కకపోవడంతో ఆయన కుటుంబానికి కీలక పదవి కల్పించే అవకాశం ఉందన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బోండా సిద్ధార్థ అభ్యర్థిత్వానికి అనుకూల వాతావరణం ఉందని ఆయన వర్గీయులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే మేయర్ అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో చంద్రబాబు నాయుడు, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది కానుంది. విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని అభిప్రాయానికి కూడా ప్రాధాన్యం ఉండొచ్చన్న ప్రచారం నేపథ్యంలో.. చివరకు మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందన్న దానిపై విజయవాడ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత రాజకీయ ప్రచారం ప్రకారం బోండా సిద్ధార్థ పేరు ముందంజలో ఉన్నప్పటికీ.. అధికారికంగా అభ్యర్థిత్వం ఖరారయ్యే వరకు దీనిపై స్పష్టత రానుంది. దీంతో విజయవాడ మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం స్థానిక టీడీపీ, కూటమి రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.



# అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి**

రోజును బ్లాక్ డేగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు అని కూడా చూడకుండా పోలీసులు దారుణంగా ప్రవర్తించారని విమర్శించారు. అసెంబ్లీలోకి వెళ్లే సమయంలో పోలీసులు తమను అడ్డుకున్నారని, తోపులాటలో తన చీరను లాగారని సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఇది వ్యక్తిగత అవమానం మాత్రమే కాదని, రాష్ట్రంలోని మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్న మహిళా నాయకురాలిగా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పలేక ప్రతిపక్షాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. తమ ఎమ్మెల్యేలు ధరించిన నల్లటి టీషర్టులపై ఉన్న నినాదాలను కారణంగా చూపుతూ అసెంబ్లీ గేటు వద్దకే వెళ్లనీయలేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష హక్కులను కాలరాయడం సరికాదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ ఘటన జరిగిందనే అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళలందరికీ సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రజాప్రతినిధులను అవమానించడం ద్వారా ప్రజల గొంతుకను అణచివేయలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందా అనే సందేహం కలుగుతోందని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేల జుట్టు, చీరలు పట్టుకుని లాగడం వంటి ఘటనలు తీవ్రంగా ఖండించదగ్గవని అన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కివేయాలనే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వైఖరి కొనసాగితే సాధారణ మహిళల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతాయని పేర్కొన్నారు. అసెంబ్లీకి వచ్చిన మహిళా సభ్యులకే రక్షణ లేకపోతే రాష్ట్రంలోని మహిళలకు భద్రత ఎలా కల్పిస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షానికి ఉన్న హక్కులను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ చరిత్రలో ఈ సంఘటన ఒక మచ్చగా నిలిచిపోతుందని, ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఇంకా అనేక మంది ఓటర్లు తమ వివరాలను సరిచేసుకునేందుకు, కొత్తగా నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో గడువు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి వేర్వేరుగా కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాసి గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల అధికారుల విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం సానుకూల నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మరింత అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ తాజా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హ పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల వర్గాలు పేర్కొన్నాయి. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు, సవరణల వినతులను స్వీకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారులు వాటిని పరిశీలించి విచారణలు నిర్వహిస్తారు. అర్హతలు, ఆధార పత్రాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయాలు తీసుకుని ఓటర్ల జాబితాను ఖరారు చేయనున్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సూచనలు జారీ చేసింది.

# ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి**

కాన్క్లేవ్'లో పార్టీ నాయకులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, సాగునీటి రంగంలో తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రముఖ 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రిని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో సమాచార సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల వనరుల అభివృద్ధితో 'వాటర్ మ్యాన్'గా గుర్తింపు పొందారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్ల వ్యయంతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఎకనామిక్ టైమ్స్ ప్రశంసించిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్టాండింగ్ ఒవేషన్‌తో చంద్రబాబును అభినందించారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి బాధ్యతలు అప్పగించడం దీనికి ఉదాహరణ అని వివరించారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికి పార్టీలోనూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని, చిన్నచిన్న వివాదాలకు తావివ్వకుండా సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనపై చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యవస్థలను దెబ్బతీసి అభివృద్ధిని వెనక్కి నెట్టిందని ఆరోపించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలన ఒక ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని, ప్రతి ఆరోపణకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగిస్తూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, రాయలసీమలో పరిశ్రమల విస్తరణ, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటు వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని సీఎం తెలిపారు. భూముల భద్రత కోసం 'రాజముద్ర', బ్లాక్‌చెయిన్ సాంకేతికతలను అమలు చేస్తూ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# అవమానంపై సీఎం ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి**

వ్యాఖ్యానించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాలంటే ఇలాంటి ఘటనలను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సభలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చ నిర్వహించగా సీఎం తన అభిప్రాయాలను వెల్లడించారు. తాను అనేక శాసనసభల కార్యకలాపాలను పరిశీలించానని, కానీ ఇంత అభ్యంతరకరమైన భాషను సభాపతిపై ఉపయోగించడం ఎప్పుడూ చూడలేదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, ఆ పదవిని అవమానించే చర్యలు సహించరానివని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రవర్తనను ఉపేక్షిస్తే చట్టసభల ప్రతిష్ఠ దెబ్బతింటుందని హెచ్చరించారు.

అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు. సంబంధిత సభ్యుడిని సభ నుంచి డిస్మిస్ చేయాలని కోరారు. అంతేకాకుండా ఆ సభ్యుడి చేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయించాలని కూడా డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాయిదా అనంతరం శాసనసభ తిరిగి ప్రారంభమైన తర్వాత స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. అయితే ముందుగా 22ఏ అంశంపై చర్చ జరపాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యుల వైఖరిని కూడా ఆయన తప్పుపట్టారు. బీఆర్ఎస్ నేతల చర్యలకు బీజేపీ నేతలు మద్దతు ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు అవమానం జరిగిన ఈ రోజు తెలంగాణకు చీకటి రోజుగా నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలిగించిన ఘటనగా దీనిని అభివర్ణించారు. చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉందని గుర్తు చేశారు.

# ..కాంగ్రెస్ నేతల భేటీ

**మొదటి పేజీ తరువాయి**

విభేదాలు ఉన్నప్పటికీ సభాపతి పదవిని గౌరవించడం ప్రతి సభ్యుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు ప్రజల్లో తప్పు సంకేతాలు పంపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పీకర్‌కు మద్దతుగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ భేటీ నిర్వహించినట్లు నేతలు తెలిపారు. చట్టసభల గౌరవం, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ విషయంలో రాజీ ఉండదని స్పష్టం చేశారు. సభాపతి పట్ల వ్యక్తిగతంగా ఎలాంటి దూషణలు లేదా అవమానకర వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ సమావేశంలో పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్నారు. తాతా మధు వ్యాఖ్యలను ఏకగ్రీవంగా ఖండిస్తూ, స్పీకర్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. చట్టసభల ప్రతిష్ఠను కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## వర్షాకాల సమావేశాలపై బీఏసీ సమావేశం

**మొదటి పేజీ తరువాయి**

సమయం వంటి కీలక అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. వర్షాకాల సమావేశాలు సజావుగా, ఫలప్రదంగా సాగేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సభలో ప్రభుత్వ పక్షం ప్రవేశపెట్టనున్న బిల్లులు, ప్రజా సమస్యలకు సంబంధించిన చర్చలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలను సభలో ప్రస్తావించే విధానం వంటి విషయాలపై బీఏసీ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై సభ్యులకు తగిన అవకాశాలు కల్పించే విధంగా సమావేశాల షెడ్యూల్ రూపొందించడంపై దృష్టి సారించారు.

శ్వేత

# సంపాదకీయం

మంగళవారం 8-9-2026

# జటిలమైన రాజకీయ భవిష్యత్తు!

ఏదీ తెగేదాకా లాగోద్దనేది పెద్దల వాదన. సమస్యను చిన్నదిగా ఉన్నప్పుడే సామరస్యంగా పరిష్కరించుకుంటే అన్ని సర్దుకుంటాయి. కానీ తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్‌కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్‌రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉంది. పరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు.

కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు. పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్‌రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే. కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది. ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు.

కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి. సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్‌ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్‌లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి. మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది. కానీ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నరు.



# 2 లక్షల సీడ్‌బాల్స్‌తో ఎన్టీఆర్ జిల్లాలో పచ్చదనానికి బాట

### పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

### .. జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ.

విజయవాడ: సెప్టెంబర్ 7, 2026: స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సీడ్‌బాల్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పాల్గొన్నారు. పచ్చదనం పెంపు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో వన్ ఎర్త్--వన్ లైఫ్ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, సంస్థ వాలంటీర్లు తయారు చేసిన 2 లక్షల సీడ్‌బాల్స్‌ను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ సీడ్‌బాల్స్ ద్వారా ప్రకృతి పునరుత్పత్తికి, పచ్చదనం పెంపునకు అవకాశం కలుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వన్ ఎర్త్--వన్ లైఫ్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విద్యార్థులు, మహిళలు, యువతను పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో పర్యావరణ స్పృహ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్రత, రీసైక్లింగ్ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. అంతరించిపోతున్న దేశవాళీ విత్తనాలను సంరక్షిస్తూ, వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంప్రదాయ విత్తన సంపదను భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే మైక్రో గార్డెనింగ్, మొక్కల పెంపకం, విత్తనాల సంరక్షణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణహిత జీవన విధానం వైపు నడిపించవచ్చని కలెక్టర్ అన్నారు.

వన్ ఎర్త్--వన్ లైఫ్ ఫౌండర్ ఏలూరి లీలా కుమారి మాట్లాడుతూ నగరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పర్యావరణ పరిరక్షణను చేరువ చేయాలనే ఉద్దేశంతో తమ సంస్థ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా మిద్దె తోటలను ప్రోత్సహిస్తూ గృహిణులకు మిద్దె తోటల పెంపకం, ఇంటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో 'ధన్వంతరి వనం' పేరుతో ఔషధ మొక్కలు నాటే కార్యక్రమాన్ని వన్ ఎర్త్--వన్ లైఫ్ ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం, విద్యార్థి,



మహిళ తమ రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని లీలా కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2 లక్షల సీడ్‌బాల్స్‌ను అనుకూలమైన కొండలు, అటవీ, బంజరు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా వెదజల్లి, సహజంగా విత్తనాలు మొలకెత్తేలా చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ ఎర్త్ -- వన్ లైఫ్ వాలంటీర్ టీం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మార్కెట్లో మన ఎంఎస్‌ఎంఈలు!

### పరిశ్రమల రాణింపునకు ఎగుమతులకు కొత్త ద్వారాలు

### 200కు పైగా ఎంఎస్‌ఎంఈలు.. 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు

### 100 ఎగుమతి ఒప్పందాలు, 100 కోట్ల వ్యాపార అవకాశాలు లక్ష్యం

### ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలు దేశీయ మార్కెట్లకే పరిమితం కాకుండా ప్రపంచ మార్కెట్లలో పోటీపడే స్థాయికి ఎదగాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వాతావరణాన్ని బలోపేతం చేస్తూ 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' విధానంతో ఉద్యోగాలను కోరుకునే వారిని ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏపీ ఎంఎక్స్‌డీపీ)లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈలను అంతర్జాతీయ ఎగుమతులకు సిద్ధం చేయడం లక్ష్యంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం ఏపీ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్--2026 కార్యక్రమం ప్రారంభమైంది. ర్యాంప్ కార్యక్రమం స్ఫూర్తితో ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇండియా ఎస్‌ఎంఈ ఫోరం భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్‌తో పాటు అంతర్జాతీయ కొనుగోలుదారులు, రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్‌ఎంఈలకు అంతర్జాతీయ మార్కెట్లను చేరువ చేయడం, విదేశీ కొనుగోలుదారులతో ప్రత్యక్ష వ్యాపార సంబంధాలను ఏర్పరచడం లక్ష్యంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో 200కు పైగా ఎంఎస్‌ఎంఈలు, 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. బుర్కినా ఫాసో, కామెరూన్, కోట్ డి ఐవరీ, ఘనా, జపాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే తదితర దేశాల నుంచి కొనుగోలుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, పెట్టుబడులు, అభివృద్ధి రంగాల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ కొనుగోలుదారులతో నేరుగా చర్చించి తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను అన్వేషించడం జరుగుతుందన్నారు. ప్రపంచ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా మన ఎంఎస్‌ఎంఈలు తమ ఉత్పత్తుల నాణ్యత, ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. ఈ రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్ ద్వారా కనీసం 100 ఎగుమతి ఒప్పందాలు, ఆర్డర్లు సాధించడంతో పాటు సుమారు రూ. 100 కోట్ల మేర ఎగుమతి వ్యాపార అవకాశాలను సృష్టించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు.

లిఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్‌లి మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి కొనుగోలుదారులను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించడం ద్వారా రాష్ట్ర ఎంఎస్‌ఎంఈలకు కొత్త అంతర్జాతీయ మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కొనుగోలుదారులు--ఎంఎస్‌ఎంఈల మధ్య జరిగే చర్చలను వాస్తవ వ్యాపార ఒప్పందాలు, ఎగుమతి ఆర్డర్లు, దీర్ఘకాలిక అంతర్జాతీయ భాగస్వామ్యాలుగా మార్చడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రివర్స్ బయ్యర్--సెల్లర్ మీట్‌లో వ్యవసాయం--ఆహార ఉత్పత్తులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, వస్త్రాలు--దుస్తులు, ఎలక్ట్రానిక్స్--ఎలక్ట్రికల్స్, ఔషధాలు--ఫార్మాస్యూటికల్స్, వైద్య పరికరాలు, ఆరోగ్యం--వెల్‌నెస్, సౌర విద్యుత్ పరికరాలు, రసాయనాలు, ఆటోమొబైల్--ఆటో కాంపోనెంట్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర 11 ప్రాధాన్యతా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొంటున్నాయన్నారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు ప్రధాన విజయరామ్, నీలపు విజయానంద రెడ్డి, నల్లపనేని మురళీమోహన్, చిన్న రాజు, బండారు రవికాంత్, సత్యనారాయణమూర్తి , ఎన్‌టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, అంతర్జాతీయ కొనుగోలుదారులు, ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీమతి ఎ. శ్రీదేవి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు

**కింగ్ డైలీ న్యూస్ పేపర్ - అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

హైదరాబాద్‌లోని నాంపల్లి సెషన్స్ డివిజన్, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ (ఋూూూ) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి, ఈ రోజు హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ ప్రాంతంలో ఉన్న జగన్నాథ స్వామి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో, శ్రీమతి ఎ. శ్రీదేవి అక్కడ నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో కల్పిస్తున్న వసతులు, ఆహారం, వైద్య సేవలు, నిత్యావసరాలు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాల గురించి ఆమె వివరాలు సేకరించారు. అలాగే, వారు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి అభిప్రాయాలను మరియు ఆందోళనలను స్వయంగా విన్నారు. అనంతరం, వడ్డిస్తున్న ఆహారం, వంట గది పరిశుభ్రత, వంట పదార్థాల నాణ్యత మరియు మొత్తం వంట గది నిర్వహణను ఆమె పరిశీలించారు. వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పరిశుభ్రమైన, నాణ్యమైన మరియు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె యాజమాన్యానికి సూచించారు. వృద్ధుల ఆరోగ్యం, భద్రత మరియు గౌరవప్రదమైన జీవనం అత్యంత ముఖ్యమని శ్రీమతి ఎ. శ్రీదేవి నొక్కి చెప్పారు. ఏదైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థను సంప్రదించవచ్చని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని ఆమె వారికి తెలియజేశారు. తమ ఆస్తులు, పింఛన్లు, బ్యాంక్ ఖాతాలు మరియు ఇతర ఆర్థిక వ్యవహారాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు; ముఖ్యంగా సైబర్ నేరాలు, మోసపూరిత ఫోన్ కాల్స్, ఞూ మోసాలు మరియు ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అవసరమైనప్పుడు న్యాయ సేవా ప్రాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం, సలహాలు మరియు ఇతర సంబంధిత సేవలను పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు శ్రీ అచ్యుత రామానుజాచార్య అజయ్ మహారాజ్



పాల్గొన్నారు. వృద్ధులకు అందిస్తున్న సేవలు, వసతులు మరియు వారి సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి ఆయన ఋూూూ కార్యదర్శికి వివరించారు. తమతో ఆప్యాయంగా మాట్లాడి, సమస్యలు మరియు అవసరాలను అడిగి తెలుసుకున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ (ఋూూూ) కార్యదర్శి శ్రీమతి ఎ. శ్రీదేవి సందర్శనను ఆశ్రమ నిర్వాహకులు మరియు వృద్ధులు అభినందించారు. శ్రీమతి వృద్ధుల అనుభవాలను మరియు వారి సేవలను గుర్తించడం, అలాగే వారికి ప్రేమ, గౌరవం, భద్రత మరియు తోడు లభించేలా చూడటం కుటుంబ సభ్యుల మరియు సమాజం యొక్క బాధ్యత అని ఎ. శ్రీదేవి నొక్కి చెప్పారు. వృద్ధుల హక్కులు మరియు సంక్షేమాన్ని పరిరక్షించడానికి, వారు గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా చూడటానికి జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు.



## ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలి

**జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి**

విజయనగరం, సెప్టెంబర్ 07: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలను ఒక్కొక్కటిగా పరిశీలించి, వాటి ప్రస్తుత స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి సంతృప్తికరమైన పరిష్కారం చూపించాలని అదేవిధంగా పరిష్కారం కాని వాటికి సరైన ఎండార్స్మెంట్ తెలియజేయాలని ఎలాంటి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్న అర్జీలను సహించేది లేదని జిల్లా అధికారులందరూ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు అదే విధంగా ఎండార్స్మెంట్ సరిగా లేని కొన్ని శాఖలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వివరణ కోరాలని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ సమీక్ష జరిగేటప్పుడు అందరి జిల్లా అధికారులు హాజరవ్వాలని అదేవిధంగా మండలాల్లో తహసిల్దార్ కార్యాలయంలో విఆర్వోలు,సెక్రటరీలు తప్పకుండా ఆన్లైన్లో హాజరు అవ్వాలని, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలు,డిప్యూటీ ఎంపీడీవోలు, సర్వేయర్లు ఇతర అధికారులు తప్పనిసరిగా హాజరు అవ్వాలని ఈ సమీక్ష అందరూ సీరియస్ గా తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సదుపాయం పై ఎక్కువగా కాల్స్ వస్తుండడంపై వివరణ కోరుతూ జిల్లాలో తాగునీటి సదుపాయం సరిగా ఉండేటట్లు చూడాలని కోరారు అలాగే ఏపీ ఈపీడీసీఎల్ పై కూడా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అందువలన విద్యుత్ సేవలను మెరుగుపరిచి ఇలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పై పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్లో సమీక్షిస్తూ ఏపీఎస్ఆర్టీసీ ర్యాంకు కిందకు పడిపోవడం పై అసంతృప్తి వ్యక్తపరిచారు, ఆర్టీసీ కాంప్లెక్స్ లో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు మెరుగు పరిచి సదుపాయం సరిగా ఉండేటట్లు చూడాలని కోరారు. మున్సిపాలిటీలో గుంతల రోడ్లపై ర్యాంకు తక్కువగా ఉండడం పై మున్సిపాలిటీ కమిషనర్ తో సమీక్షిస్తూ గుంతల రోడ్డు వెంటనే పూడ్చి గుంతలు లేని రోడ్లను సమకూర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఆన్‌లైన్ ద్వారా ఆర్‌డిఓలు, తాహసీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.



## రైతన్నలకు మెరుగైన సేవలు అందించాలి

**మీసాల బాబాయ్ పేరు నిలబెట్టాలి**

**ఎత్తిపోతల పథకం చైర్మన్గా అంజి మూర్తి**

**చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్**

ఏలూరు జిల్లా, కామవరపుకోట, సెప్టెంబర్ 6: శ్రీ గంటా హనుమంతరావు ఎర్ర కాలవ ఎత్తిపోతల పథకం ద్వారా రైతన్నలకు మెరుగైన సేవలు అందించాలని సంఘ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కంఠమనేని అంజి మూర్తికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. ఎత్తిపోతల పథకం చైర్మన్గా వ్యవహరించే కంటమనేని సత్యనారాయణ (మీసాల బాబాయ్) ఇటీవల కాలంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో సంఘ ఉపాధ్యక్షులు మానుకొండ దేవసుతుడు అధ్యక్షతన ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశాల మేరకు సమావేశమై సంఘ పరిధిలోని కంఠమనేని వారి గూడెం గ్రామానికి చెందిన కంఠమనేని అంజి మూర్తిని ఏకగ్రీవంగా చైర్మన్గా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ బాధ్యతలు చేపట్టిన అంజి మూర్తి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే రోషన్ కుమారును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ సంఘ పరిధిలో మీసాల బాబాయి పేరుకు దీటుగా పనిచేయడంతో పాటు, రైతన్నలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. చైర్మన్‌గా ఎన్నికైన అంజి మూర్తిని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణతో పాటు మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు ఘంటా మాధవరావు, రేగుంట సురేష్, గోరింక దాసు, బేతిన వెంకట్రావు, ఘంటా సత్యంబాబు, కొండూరి రాజా, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు, కూటమి నాయకులు అభినందించారు.

## యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా

ఏలూరు, సెప్టెంబర్ 7: రాష్ట్రంలో ఆటో, క్యాబ్, లారీ, అంబులెన్స్ తదితర మోటార్ రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నాడు ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో మరియు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా చేశారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాకు ఏపీ ఆటో మరియు మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశీ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఆటో కార్మిక సంఘం నాయకులు కాశీ కృష్ణ మాట్లాడుతూ 2024 ఎన్నికల




సందర్భంగా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు గుధి బండగా ఉన్న జీవో నెంబర్లు 21 మరియు 31 లను రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



## ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ. 2.03 కోట్లు

ద్వారకా తిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గత 18 రోజులకు సంబంధించిన హుండీ కానుకల లెక్కింపును సోమవారం (07.09.2026) నిర్వహించారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 7 వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ. 2,03,75,763 (రెండు కోట్ల మూడు లక్షల డెబ్బై ఐదు వేల ఏడువందల అరవై మూడు రూపాయలు) నగదు ఆదాయం లభించింది. ఈ కాలంలో రోజుకు సగటున రూ. 11,31,987 ఆదాయం సమకూరింది.

ప్రధాన ఆలయం (కరెన్సీ నోట్లు): రూ. 1,90,64,406

ప్రధాన ఆలయం (నాణేలు): రూ. 11,25,200

అన్నదానం ట్రస్టు: రూ. 1,65,165

గోసంరక్షణ ట్రస్టు: రూ. 20,992

బంగారం, వెండి కానుకలు:

నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల్లో 104 గ్రాముల బంగారం, 2 కిలోల 410 గ్రాముల వెండి లభించాయి. రద్దయిన నోట్లలో 2000 రూపాయల నోట్లు 2, 500 రూపాయల నోట్లు 5 హుండీలో లభ్యమయ్యాయి.

విదేశీ కరెన్సీ:

యూఎస్ఏ (432 డాలర్లు), యూఏఈ (930 దిర్హామ్స్), బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (20 పౌండ్లు), యూరో (100), ఆస్ట్రేలియా (130 డాలర్లు), కెనడా (75 డాలర్లు), సింగపూర్ (50 డాలర్లు), టర్కీ (400 లిరా), శ్రీలంక (600 రూపాయలు), జపాన్ (1,000 నిప్పన్ గింకో), మలేషియా (8 రింగిట్), సౌదీ అరేబియా (115 రియాళ్లు), కువైట్ (5 దినార్లు), బహ్రెయిన్ (1/2 దినార్), నేపాల్ (20 రూపాయలు), ఖతార్ (1 రియాల్), ఒమన్ (100 బైసా) తదితర విదేశీ కరెన్సీలను భక్తులు సమర్పించారు.ఐఈ లెక్కింపు కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఒ ఈవో ఆర్.వి.చందన, ద్వారకా తిరుమల దేవస్థానం ఈవో (ఖీూజ) వి.త్రినాధరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు సి.హెచ్. హనుమంతరావు, ఎం. శ్రీనివాసరావు, సి.హెచ్. శివకృష్ణ బ్రహ్మ, కాకి సురేష్, ఎ. సత్యనారాయణ పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే

**తొలిదశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు**

**... జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

విజయవాడ: సెప్టెంబర్ 7, 2026.జిల్లాలో సెప్టెంబర్ 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేకు సంబంధించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, "అంగవైకల్యాన్ని నివారించడానికి ముందుగానే కుష్ఠు వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తాము" అనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా రెండు వారాల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడంతో పాటు అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ సర్వేకు పూర్తి సహకారం అందించాలని, ఆరోగ్య సిబ్బంది తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను తెలియజేసి పరీక్షలకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. శరీరంపై స్పర్శ తెలియని లేదా స్పర్శ తగ్గిన అనుమానాస్పద మచ్చలు కనిపించినట్లయితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సర్వే బృందానికి తెలియజేసి పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా నియంత్రించడంతో పాటు, బాధితులకు సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వేలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఎంపిక చేసిన పురుష ఆరోగ్య కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని ప్రతి ఇంటినీ సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబంలోని సభ్యులను ఆరోగ్య సిబ్బంది పరిశీలించి, కుష్ఠు వ్యాధికి సంబంధించిన అనుమానాస్పద లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తిస్తారని చెప్పారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇంటింటి సర్వేలో భాగంగా అనుమానిత కేసులను గుర్తించిన అనంతరం, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ద్వారా మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని జిల్లా కలెక్టర్ వివరించారు. వైద్య పరీక్షల్లో కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయిన వారికి



వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ -- బహుళ ఔషధ చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చికిత్సను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కుష్ఠు వ్యాధికి సంబంధించిన పరీక్షలు, చికిత్సను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వ్యక్తులు చికిత్స విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని సూచించారు.

# సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

**ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా పీజీఆర్ఎస్**

**నాణ్యమైన సేవలు అందించడం అధికారుల బాధ్యత**

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 171 అర్జీలు: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను మరింత సమర్ధవంతంగా నిర్వహించడంలో భాగస్వాములు కావాలని, అర్జీల పరిష్కార నాణ్యతలో రాజీలేకుండా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 171 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సేవలకు సంబంధించి 50, పోలీసు శాఖకు 33, పురపాలక పట్టణాభివృద్ధికి 24, పంచాయతీరాజ్‌కు 15 అర్జీలు వచ్చాయి. విద్య, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలకు ఏడు చొప్పున, వైద్య ఆరోగ్య శాఖకు 6, విద్యుత్ శాఖకు 4 అర్జీలు రాగా ఎండోమెంట్, ఇరిగేషన్, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు శాఖలకు మూడు చొప్పున, డీఆర్‌డీఏ, ఉపాధి కల్పన, సమగ్ర శిక్షలకు రెండేసి చొప్పున, పశుసంవర్ధక, ఐసీడీఎస్, సమాచార, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, రవాణా, సాంకేతిక విద్యా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. వీటిని క్షుణ్నంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పీజీఆర్ఎస్ ద్వారా



తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం కలుగుతోందన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో వేగంతో పాటు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో పాటు పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.



## కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**యువత సృజనాత్మకతకు కంటెంట్ క్రియేషన్ స్టూడియో వేదిక**

**'లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్'కు ప్రోత్సాహం**

**పర్యాటక, సాంస్కృతిక వైభవానికి డిజిటల్ ప్రచారం**

విజయవాడ: సెప్టెంబరు 7,2026:ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంటెంట్ క్రియేషన్ స్టూడియో, ల్యాబ్‌లను యువత, మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. 'ఆరెంజ్ ఎకానమీ'లో భాగంగా సృజనాత్మకత, డిజిటల్ మీడియా, పర్యాటకం, సంస్కృతి, ఉపాధిని అనుసంధానం చేస్తూ యువతకు కొత్త అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కంటెంట్ ల్యాబ్‌లో వీడియో రికార్డింగ్, ఎడిటింగ్, లైవ్ స్ట్రీమింగ్ వంటి ప్రొఫెషనల్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంటెంట్ తయారీ, వీడియో చిత్రీకరణ, ఎడిటింగ్, కథనం, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ అందిస్తామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, గ్రామీణ యువతలోని ప్రతిభను గుర్తించి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలుగా మలచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, పండుగలు, స్థానిక వంటకాలు, జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేలా నాణ్యమైన కంటెంట్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా 'లోకల్ టాలెంట్ -- లోకల్ ఇన్‌కమ్'తో పాటు జిల్లాకు విస్తృత పర్యాటక, సాంస్కృతిక ప్రచారం లభిస్తుందన్నారు. లికంటెంట్ స్టూడియో, ల్యాబ్ వినియోగం, శిక్షణకు సంబంధించిన వివరాల కోసం కంటెంట్ ల్యాబ్ నిర్వాహకులు బివి రామకృష్ణ -- 9885202025ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి -- ప్రతి ఒక్కరికీ విద్య అందాలి

**అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ: సెప్టెంబరు 7, 2026: సెప్టెంబరు 8న నిర్వహించనున్న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా వయోజన విద్యాశాఖ రూపొందించిన గోడ పత్రికను సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ అక్షరాస్యత అనేది వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా కీలకమని తెలిపారు. చదవడం, రాయడంతో పాటు నిత్య జీవితానికి అవసరమైన ప్రాథమిక జ్ఞానం, అవగాహన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించడం ద్వారా వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన



పెంపొందించుకోగలరని తెలిపారు. అక్షరాస్యతను సామాజిక ఉద్యమంగా తీసుకెళ్లేందుకు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 8, మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ కేబీఎన్ కాలేజీ ఆడిటోరియంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు వయోజన విద్యా కార్యక్రమాలపై ప్రజలకు వివరించేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, వయోజన విద్యాశాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలి

**ఇంటింటి సర్వే గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

ఏలూరు, సెప్టెంబరు 07: జిల్లాలో కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలని, ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్యసేవలు, వైద్యచికిత్సలు అందించేందుకు చేపడుతున్న ఇంటింటి సర్వేను జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టునివారణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుండి 29వ తేదీ వరకు 14 రోజులు పాటు ఇంటింటి కుష్టువ్యాధి నిర్మూలన సర్వేగోడ పత్రికలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలన ఇంటింటి సర్వే ఇంటింటికీ వెళ్ళి నిర్వహించే సర్వేలో సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. చర్మంపై కనిపించే అనుమానాస్పద మచ్చలు, పొక్కులు,రంగు మార్పులు, స్పర్శతగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సర్వే సిబ్బందికి తెలియచెయ్యాలని సూచించారు. అనుమానిత కేసులను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల్లో చర్మవ్యాధులు, ముఖ్యంగా కుష్టువ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి ప్రారంభదశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే సందర్భంగా ఆరోగ్య సిబ్బంది అడిగే వివరాలను ప్రజలు అందించి, కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని జిల్లా కలెక్టరు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సర్వే సజావుగా జరిగేలా సంబంధిత శాఖలు అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలని, సర్వే లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వేలో వైద్యఆరోగ్యశాఖ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టు నివారణ శాఖ సిబ్బందితో పాటు 1785 మంది ఆశా వర్కర్లును ఇంటింటి సర్వేలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, జిల్లా వైద్యఆరోగ్య అధికారి డా.యు. శోభ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టు నివారణ అధికారి డా.యన్. లక్ష్మీనారాయణ, ఫిజియో థెరపిస్ట్ డా.వై.యస్. చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.







# స్వచ్ఛతతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు

**జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీ.. కార్యక్రమ విశిష్టతను చాటిచెప్పిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. స్వచ్ఛతను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు, పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజంతో పాటు స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం నివారణ, చెత్త నిర్వహణ, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా చూడటం, పచ్చదనం పెంపొందించడం వంటి అంశాలపై నినాదాలు చేస్తూ స్వచ్ఛత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ప్లాస్టిక్ కవరు వాడకు... ప్రాణాలను తీయకు.. అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని సూచించారు. తడి, పొడి చెత్త నుండి ఎరువు... చేస్తే ఉ ఒడదు బరువు అంటూ చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు. తడి చెత్తను సక్రమంగా వినియోగిస్తే సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని, తద్వారా చెత్త సమస్యను తగ్గించవచ్చని అవగాహన




కల్పించారు. డ్రైన్లలో చెత్త వేయకు... దోమలకు ఇల్లు కట్టకు.. అనే నినాదంతో డ్రైనేజీల్లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించి ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని తెలిపారు. పచ్చదనం... ప్రకృతి ధనం.. అనే సందేశంతో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. చెత్తను నిర్దేశిత విధానంలో నిర్వహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో సీతా మహాలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్-2026 పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 07, :

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమం అమలుపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి. సుధర్శన్ రెడ్డి ఐఏఎస్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఐఏఎస్, డిప్యూటీ సీఈవో జి.ఎస్. చారి పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు (డీఈవోలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు) సమావేశంలో పాల్గొని ఎస్ఐఆర్-2026 అమలు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై సీఈవో ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి నోటీసును సంబంధిత ఓటరుకు బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) స్వయంగా అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల చిరునామాలను గుర్తించడంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు సమాచారం చేరడంలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లాలకు అదనంగా కేటాయించిన లాగిన్ సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించి పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సీఈవో ఆదేశించారు. అన్ మ్యాపింగ్, అనామలీస్ కేసులకు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీల సమావేశాల్లో వారికి అందుబాటులో ఉంచాలని సూచించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన కాలంలో బీఎల్ఏలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పత్రాలను సక్రమంగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్లు చేసే పొరపాట్లకు సంబంధిత ఈఆర్వోలు, ఏఈఆర్వోలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చ రించారు. డేటా నమోదు, పత్రాల అప్‌లోడింగ్ ప్రక్రియలో ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి విచారణ కేంద్రాల పరిధిలోకి రాని ప్రాంతాల్లో సూపర్‌వైజర్లు నేరుగా వారి నివాసాలకు వెళ్లి అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు ఈఆర్వో, డీఈవో స్థాయిలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరుకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈవోలతో నోటీసుల పంపిణీ, విచారణల షెడ్యూల్, ఈఆర్వో, డీఈవో లాగిన్‌లలో పెండింగ్ కేసుల పరిష్కార పురోగతిపై సీఈవో సమీక్ష నిర్వహించారు.



## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 7, :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత ప్రాంతాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు భారత విమానాశ్రయాల సంస్థకు చెందిన బహుళ విభాగాల సాంకేతిక బృందం జిల్లాకు చేరుకుని క్షేత్రస్థాయి అధ్యయనం ప్రారంభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా బృందం వివిధ ప్రాంతాల్లో భూముల అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, మౌలిక వసతుల అవకాశాలను పరిశీలిస్తోంది. భారత్ రెడ్డి నేతృత్వంలోని బృందం సీతంపేట, సుజాతనగర్, దుమ్ముగూడెం, చాపరాలపల్లి, పాల్వంచ, దమ్మపేట, పెనగడప ప్రాంతాలను సందర్శించి భూమి లభ్యత, విస్తీర్ణం, సర్వే హద్దులు, రన్‌వే నిర్మాణానికి అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన పరిస్థితులను అధ్యయనం చేసింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయ విస్తరణకు అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించింది. చిన్న విమానాలతో పాటు పెద్ద ప్రయాణికుల విమానాలు కూడా దిగేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై బృందం దృష్టి సారించింది. ఇందుకోసం పొడవైన రన్‌వే నిర్మాణానికి అవసరమైన భూమి, భౌగోళిక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అవసరమైన సదుపాయాలపై సాంకేతిక అధ్యయనం కొనసాగుతోంది. విమానాశ్రయం భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతాల సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే మార్గం విమానాశ్రయ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని కూడా బృందం పరిశీలిస్తోంది. అవసరమైతే సాంకేతిక పరిష్కారాల ద్వారా అవరోధాలను అధిగమించే అవకాశాలను అధ్యయనం చేయడంతో పాటు సంబంధిత శాఖల అనుమతుల అంశాన్ని కూడా పరిశీలించనుంది. ఈ సందర్భంగా సింగరేణి అతిథి గృహంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో సాంకేతిక బృందం సమావేశమైంది. విమానాశ్రయ నిర్మాణం ద్వారా పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన భూ రికార్డులు, సర్వే వివరాలు, రెవెన్యూ మ్యాపులు, రహదారి అనుసంధానాలు, సాంకేతిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగం బృందానికి అందుబాటులో ఉంచింది. రెండు రోజుల పరిశీలన అనంతరం సమగ్ర సాంకేతిక నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన తదుపరి నిర్ణయాలు ఆ నివేదిక ఆధారంగానే తీసుకోనున్నారు.

# ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 07, :



అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర పోలీసు శాఖకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, ప్రజాప్రతినిధులు తమ రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిర్వర్తించే విషయంలో ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేసింది. ఈ ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని రాష్ట్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారంటూ ఆ పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలను పరిశీలించిన న్యాయస్థానం, ప్రజల చేత ఎన్నుకోబడిన శాసనసభ్యులు సభకు హాజరై తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనడం సభ్యుల హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొంది. ఈ సందర్భంగా న్యాయస్థానం రాష్ట్ర పోలీసులకు స్పష్టమైన సూచనలు చేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవడం లేదా వారి విధులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకూడదని తెలిపింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, శాంతిభద్రతల నిర్వహణ పేరుతో ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘించిన సందర్భాల్లో చట్టబద్ధమైన చర్యలు తీసుకునే అధికారం సభాపతికి ఉంటుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. శాసనసభ కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాల్లో సభకు స్వతంత్ర అధికారాలు ఉన్నాయని, సభ్యుల ప్రవర్తనపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత స్పీకర్ పరిధిలోనే ఉంటుందని పేర్కొంది. అందువల్ల పోలీసు చర్యలు రాజ్యాంగబద్ధ వ్యవస్థల పరిధిని దాటకూడదని సూచించింది. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, పరిస్థితుల నివేదికను సమర్పించాలని హోంశాఖను న్యాయస్థానం ఆదేశించింది. ఆ రోజు చోటుచేసుకున్న పరిణామాలు, పోలీసుల చర్యలు, ప్రజాప్రతినిధుల అభ్యంతరాలపై సమగ్ర సమాచారం అందించాలని పేర్కొంది. తద్వారా వాస్తవ పరిస్థితులను పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. వాదనలు విన్న అనంతరం కేసు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు హోంశాఖ నుంచి నివేదిక సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ హక్కులు పరిరక్షించబడేలా అన్ని వర్గాలు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచిం చింది. ఈ వ్యవహా రం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ నీయాంశంగా మారింది.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 7, :



ప్రజావాణి కార్యక్రమం ద్వారా స్వీకరించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యానికి తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పింఛన్ల మంజూరు, గృహాల కేటాయింపు, ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పలు అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖలకు తక్షణ చర్యల కోసం పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు లోతుగా పరిశీలించాలని సూచించారు. సమస్యల స్వభావాన్ని అర్థం చేసుకుని తక్షణ పరిష్కార మార్గాలను అన్వేషించాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల ప్రజల సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తూ వినతుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. పరిష్కారం కోసం నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, ప్రజల కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికా రులకు సూచించారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా మండ ల స్థాయిలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండ లాల్లోని ఎంపీడీఓ కార్యాల యాల్లో ప్రజలు తమ సమస్య లకు సంబంధించిన వినతు లను సమర్పించవచ్చని చెప్పా రు. స్థానిక స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు సమయం, వ్యయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ప్రజలు దరఖాస్తులు సమర్పించే సమయంలో సంబంధిత ఆధార పత్రాలను జత చేయాలని కలెక్టర్ సూచించారు. సరైన పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ప్రతి అర్జీకి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ భరోసా ఇచ్చారు.

# ప్రజావాణి వినతులపై ప్రత్యేక దృష్టి

ములుగు, సెప్టెంబర్ 7:



ములుగు జిల్లాలో ప్రజావాణి ద్వారా అందుతున్న ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలతో వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వంతో నేరుగా అనుసంధానం కల్పించే ముఖ్య వేదికగా నిలుస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూల దృక్పథంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపించాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 36 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో భూ సంబంధిత సమస్యలకు సంబంధించిన 9 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక దరఖాస్తు, పింఛన్లకు సంబంధించిన ఒక దరఖాస్తు, ఉద్యోగాల కోసం 15 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 10 దరఖాస్తులు ఉన్నాయి. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజావాణి వేదిక ద్వారా నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. దరఖాస్తుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అర్జీదారులకు సమాచారం అందించాలని కూడా ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, గృహాలు, భూ సమస్యలు వంటి అంశాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించడం అధికారుల కర్తవ్యమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# ఏఐతో మానవ మేధస్సుకు ముప్పు.. రామ్ గోపాల్ వర్మ

హైదరాబాద్, సెప్టెంబర్ 7, :

విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంపై స్పందించిన ఆయన, భవిష్యత్తులో మానవ మేధస్సు, సృజనాత్మకతకు తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు పారిశ్రామిక విప్లవం శారీరక శ్రమ ఆధారిత ఉద్యోగాలను ప్రభావితం చేసినట్లే, ఇప్పుడు ఏఐ ఆలోచన ఆధారిత ఉద్యోగాలపై ప్రభావం చూపబోతోందని హెచ్చరించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో వర్మ సుదీర్ఘ పోస్టు చేశారు. ఏఐని సమయానికి అర్థం చేసుకుని వినియోగించుకోని వారి ఉద్యోగాలే ముందుగా ప్రమాదంలో పడతాయని పేర్కొన్నారు. సాంకేతికత ఎప్పుడూ మానవ జీవితాన్ని సులభతరం చేయడానికే రూపొందించబడిందని, శారీరక శ్రమను తగ్గించడంతో పాటు సమయాన్ని ఆదా చేయడమే దాని ప్రధాన లక్ష్యమని వివరించారు. మానవులు ఎప్పుడూ ఎక్కువ స్వేచ్ఛా సమయం కోరుకుంటారని, ఇప్పుడు ఏఐ ఆ స్వేచ్ఛను మరింత విస్తృతంగా అందించే దిశగా పయనిస్తోందని వర్మ అభిప్రాయపడ్డారు.

**అయితే అదే సమయంలో ఈ పరిణామం కొత్త సవాళ్లకు కూడా దారితీస్తుందని సూచించారు. సాంకేతిక పురోగతి ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో, దానికి అనుగుణంగా మనుషులు కూడా తమ నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన పోస్టులో మానవుల ప్రధాన బలాలను ప్రస్తావించిన వర్మ, మనిషికి ఉన్న రెండు ప్రధాన ఆస్తులు కండబలం, ఆలోచించే మెదడేనని పేర్కొన్నారు. పారిశ్రామిక విప్లవం కండబలం అవసరాన్ని గణనీయంగా తగ్గించిందని, ఇప్పుడు ఏఐ ఆలోచనా శక్తి ఆధారిత పనులపై ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించారు.**

ఇది సాంకేతిక అభివృద్ధిలో మరో కీలక మలుపుగా ఆయన అభివర్ణించారు. 'కోరుకున్నది నిజమైతే అది ప్రమాదంగా మారవచ్చు' అనే భావనను ప్రస్తావిస్తూ వర్మ తన ఆందోళనను వ్యక్తం చేశారు. మనుషులు ఎప్పటినుంచో ఎక్కువ విశ్రాంతి, తక్కువ పని కోరుకుంటూ వచ్చారని, ఇప్పుడు ఏఐ ఆ దిశగా ప్రపంచాన్ని నడిపిస్తున్నప్పటికీ దాని ప్రభావాలపై ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీశాయి. రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఏఐ భవిష్యత్తు, ఉద్యోగాలపై దాని ప్రభావం, మానవ మేధస్సు పాత్ర వంటి అంశాలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సాంకేతికతను అవకాశంగా మార్చుకోవాలని కొందరు అభిప్రాయపడుతుండగా, దాని వల్ల తలెత్తే సవాళ్లను ముందుగానే అంచనా వేయాలని మరికొందరు సూచిస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి: కలెక్టర్

ములుగు, సెప్టెంబర్ 7, :

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, ప్రజల సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి అనుమతులు పొందాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అధికారిక అనుమతులు పొందిన తర్వాతే మండపాల ఏర్పాటు చేపట్టాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు చట్టబద్ధంగా, క్రమశిక్షణతో సాగేందుకు నిర్వాహకులు సహకరించాలని మండపాల వద్ద జూదం, అభ్యంతరకర ప్రసంగాలు, ఇతర అవాంఛనీయ కార్యకలాపాలకు అవకాశం కల్పించరాదని కలెక్టర్ హెచ్చరించారు. భక్తి కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మసీదులు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు వంటి సున్నిత ప్రాంతాల సమీపంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రార్థనా సమయాల్లో మసీదుల సమీపంలోని మండపాల నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించాలని కలెక్టర్ సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని, భక్తిగీతాలు మాత్రమే వినిపించాలని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యాన్ని నివారించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పర్యావరణహిత ఉత్సవాల నిర్వహణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు, దీపాలను సురక్షితంగా ఏర్పాటు చేయడంతో పాటు నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వినియోగించాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ల కోసం ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని స్థానిక సంస్థల అధికారులను ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు స్పష్టం చేశారు.





# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్, సెప్టెంబర్ 7, :

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలి రోజే ప్రధాన ద్వారం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన వ్యక్తం చేస్తూ బ్లాక్ టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద భారీగా మోహరించిన పోలీసులు నల్ల టీషర్టులు ధరించిన సభ్యులను లోనికి అనుమతించబోమని స్పష్టం చేయడంతో బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు వస్తున్న తమను అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని వాదిస్తూ గేటు వద్దే ఆందోళనకు దిగారు. పోలీసుల అడ్డంకులను వ్యతిరేకిస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు తన టీషర్ట్‌ను అక్కడికక్కడే తొలగించి సభలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ పోలీసులు ముందుకు కదలనివ్వకపోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ గేటు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో తోపులాట పరిస్థితి ఏర్పడి కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ప్రధాన ద్వారం పరిసరాలు నినాదాలతో మార్మోగిపోయాయి. ఈ తోపులాటలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కింద పడిపోయారు. వారిని సహచర సభ్యులు పైకి లేపగా అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తోపులాటలో చిక్కుకుని ముఖం, చేతికి గాయాలైనట్లు పార్టీ నేతలు తెలిపారు. జగదీశ్‌రెడ్డికి కూడా స్వల్ప గాయాలయ్యాయని పేర్కొన్నారు. గాయపడిన నేతలకు అక్కడే ప్రాథమిక చికిత్స అందించినట్లు సమాచారం. పోలీసుల చర్యల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు మెడ పట్టుకుని నెట్టేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తన చీరను లాగారని ఆరోపిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వ్యవహారం ప్రజాస్వామ్య చరిత్రలో ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ మహిళా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు కనీస గౌరవం ఇవ్వకుండా పోలీసులు వ్యవహరించారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించేందుకు వస్తున్న ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకే తమను అడ్డుకున్నారని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను సభలో ప్రస్తావించాలనే ఉద్దేశంతో వచ్చిన తమపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.







# గుడ్ల సరఫరా ఈ-టెండర్లలో పారదర్శకతకు పెద్దపీట

## నాణ్యత, పోటీతత్వానికి ప్రాధాన్యత: కలెక్టర్

జనగామ, సెప్టెంబర్ 07:

2026--27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖలకు గుడ్ల సరఫరా కోసం చేపట్టనున్న ఈ-టెండర్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. టెండర్ ప్రక్రియలో ప్రతి దశను పారదర్శకంగా అమలు చేసి ప్రభుత్వానికి, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాలో 2026--27 సంవత్సరానికి మొత్తం 1,17,94,130 గుడ్ల అవసరం నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గుడ్ల సరఫరా కోసం ఈ-టెండర్ విధానంలోనే ఆన్‌లైన్ బిడ్లను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. సంక్షేమ శాఖలకు అవసరమైన గుడ్ల సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన సరఫరా, సమయపాలన, పారదర్శకతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. టెండర్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 11న ముందస్తు బిడ్ సమావేశాన్ని నిర్వహించి టెండర్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 21న సాంకేతిక బిడ్లను, సెప్టెంబర్ 22న ఆర్థిక బిడ్లను తెరవనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన అన్ని సంస్థలకు సమాన అవకాశాలు కల్పిస్తూ పోటీతత్వాన్ని ప్రోత్సహించే విధంగా టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి దశను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ పూర్తిగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలోనే జరుగుతుందని, ఎలాంటి పెట్టె టెండర్లను స్వీకరించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమాచార మరియు పౌరసంబంధాల శాఖ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టెండర్ ప్రకటనను తప్పనిసరిగా ప్రచురించాలని సూచించారు. ప్రక్రియలో ఎలాంటి వివాదాలు లేదా అనుమానాలకు తావులేకుండా అన్ని చర్యలు పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో గుడ్ల సరఫరా, పంపిణీ, వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అనువర్తనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ వ్యవస్థ ద్వారా అన్ని సంబంధిత శాఖలకు గుడ్ల సరఫరా వివరాలను తక్షణమే పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ప్రతి రైతు కుటుంబానికి స్థిర ఆదాయం లక్ష్యం

నారాయణపేట, సెప్టెంబర్ 7:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వనరులను కల్పించే సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కరువు నివారణ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కరువు నివారణ కార్యక్రమంలో భాగంగా ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయగా, అమలు బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు కార్యాచరణ ప్రణాళికను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద అన్ని కార్యక్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను చిన్న చిన్న కార్యక్రమాలుగా విభజించకుండా, ఎక్కువ మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రధాన ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి కేంద్రంగా మారే విధంగా కార్యాచరణ ఉండాలని పేర్కొన్నారు. వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం వంటి జీవనాధార రంగాలను ప్రణాళికల్లో భాగం చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహాయం, పశువైద్య సేవలు, మార్కెట్ అవకాశాలు కల్పించే విధంగా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ కుటుంబాల ఆదాయం పెరగాలంటే వ్యవసాయేతర రంగాలకూ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్పత్తి నుంచి విక్రయాల వరకు మొత్తం ప్రక్రియను అనుసంధానం చేస్తూ విలువ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. ముడి సరుకుల సరఫరా, ఉత్పత్తి, సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలు సమన్వయంతో పనిచేసేలా చూడాలని సూచించారు. గ్రామ పంచాయతీలను కేవలం సహజ వనరుల నిర్వహణకే పరిమితం చేయకుండా కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి వారి అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఉపాధి అవకాశాలను గుర్తించి ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు, మార్కెట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత బలోపేతం చేయాలని, అవసరమైతే మాత్రమే కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, సాంకేతిక సహాయం వంటి అంశాల్లో రైతు సంఘాలకు మద్దతు అందించాలని తెలిపారు. "ఒక గ్రామం -- ఒక సమగ్ర ప్రణాళిక -- ప్రతి కుటుంబానికి ప్రయోజనం -- స్థిరమైన ఆదాయం" అనే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ప్రతి ప్రణాళిక ఆర్థికంగా సాధ్యమైనది, దీర్ఘకాలికంగా నిలకడైనది, కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, మత్స్యశాఖ అధికారి రెహమాన్, సంబంధిత సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## రకుల్ మళ్లీ జిమ్‌లోకి

హైదరాబాద్, సెప్టెంబరు 7 :సినీ పరిశ్రమలో కథానాయికల కెరీర్ ఎప్పుడు ఎలాంటి మలుపు తీసుకుంటుందో చెప్పడం కష్టం. ఒకప్పుడు వరుస విజయాలతో అగ్ర కథానాయికలుగా వెలుగొందిన పలువురు.. ఆ తర్వాత అవకాశాలు తగ్గడంతో సినిమాలకు దూరమవుతుంటారు. కొందరు వివాహం చేసుకుని కుటుంబ జీవితానికి ప్రాధాన్యత ఇస్తుండగా.. మరికొందరు వ్యాపారం, ఇతర రంగాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకప్పుడు టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది. కొంతకాలంగా సినిమాల్లో పెద్దగా కనిపించని రకుల్.. దాదాపు ఏడాదిన్నర విరామం తర్వాత మళ్లీ కసరత్తులు ప్రారంభించారు.



## 51 ఏళ్ల వయసులోనూ
## అమీషా గ్లామర్

హైదరాబాద్, సెప్టెంబరు 7 :సినీ పరిశ్రమలో కథానాయికల కెరీర్ ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో చెప్పడం కష్టం. వివిధ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఎంతోమంది కథానాయికలు ఒక దశలో అగ్ర కథానాయికలుగా ఎదిగి.. ఆ తర్వాత అనూహ్యంగా సినిమాలకు దూరమవుతుంటారు. కొందరు వివాహం చేసుకుని కుటుంబ జీవితానికి పరిమితమవుతుండగా.. మరికొందరు ఇతర రంగాలపై దృష్టి పెడుతున్నారు. ఇంకొందరు మాత్రం సినిమాల్లో అడపాదడపా కనిపిస్తూనే సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. అలాంటి కథానాయికల్లో అమీషా పటేల్ ఒకరు.

ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అమీషా పటేల్.. పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్ వంటి అగ్ర కథానాయకుల సరసన నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'బద్రి', 'నాని', 'నరసింహుడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె.. ఆ తర్వాత బాలీవుడ్‌పై ఎక్కువగా దృష్టి సారించారు. హిందీ చిత్రాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ అక్కడ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

తెలుగు సినిమాలకు దూరమైన తర్వాత అమీషా పటేల్ బాలీవుడ్‌లోనే ఎక్కువగా కనిపించారు. అయితే కొంతకాలం పాటు వరుస విజయాలు లేకపోవడంతో ఆమె సినీ ప్రయాణం కాస్త నెమ్మదించింది.

## 'ఇరుముడి'కి తగ్గని జోరు

హైదరాబాద్, సెప్టెంబరు 7 :మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి' చిత్రం వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సాధారణంగా ఏ సినిమా అయినా మూడో వారానికి వచ్చేసరికి థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ తగ్గుతుంది. కానీ కొత్త సినిమాలు పోటీలో ఉన్నప్పటికీ 'ఇరుముడి' మాత్రం అందుకు భిన్నంగా దూసుకెళ్తోంది. మూడో ఆదివారం అయిన సెప్టెంబరు 6న ఆన్‌లైన్‌లో ఏకంగా 2.15 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో సినీ వాణిజ్య వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. తండ్రీకూతుళ్ల అనుబంధం, అయ్యప్ప భక్తి నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా ప్రేక్షకులు ట్రాక్టర్లు, ప్రైవేటు వాహనాల్లో థియేటర్లకు తరలివస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. మూడో వారంలోనూ ఇంతటి ఆదరణ కొనసాగడం 'ఇరుముడి'కి ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది.




## బిపాసా బసు రీ-ఎంట్రీ

హైదరాబాద్, సెప్టెంబరు 7 :బాలీవుడ్‌లో ఒకప్పుడు అగ్ర కథానాయికగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి బిపాసా బసు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె.. దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఓ విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ దర్శకుడు హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న పీరియడికల్ క్రైమ్ థ్రిల్లర్ 'బారాబంకి'లో బిపాసా బసు కీలక పాత్రలో నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. క్రైమ్, నాటకీయ అంశాలను మేళవిస్తూ రూపొందుతున్న ఈ చిత్రంలో బిపాసా పాత్ర ఎలా ఉండబోతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. కథలో ఆమె పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తుండటంతో అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. అయితే ఆమె పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు.




## 'రంభ ఊర్వశి మేనక'కు పెరుగుతున్న ఆదరణ

హైదరాబాద్, సెప్టెంబరు 7 :సినిమాలో సరైన విషయం ఉంటే ప్రేక్షకులు ఎలాంటి ఆదరణ అందిస్తారో 'రంభ ఊర్వశి మేనక' మరోసారి నిరూపిస్తోంది. అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సామాజిక, అద్భుత కథాంశంతో కూడిన హాస్య చిత్రం సెప్టెంబరు 4న థియేటర్లలో విడుదలైంది. విడుదలకు ముందు మంచి అంచనాలు ఉ న్నప్పటికీ తొలి రోజు సినిమాకు మిశ్రమ స్పందనతో పాటు కొన్ని ప్రతికూల సమీక్షలు వచ్చాయి.

## మోక్షజ్ఞ ఎంట్రీ.. దర్శకుడు వశిష్ఠ

హైదరాబాద్, సెప్టెంబరు 7, :

నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సినీ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మోక్షజ్ఞ ఎప్పుడు హీరోగా పరిచయం అవుతారు? ఆయనను లాంచ్ చేయబోయే దర్శకుడు ఎవరు? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు? అనే ప్రశ్నలకు ఎట్టకేలకు సమాధానం దొరికింది. మోక్షజ్ఞ తొలి సినిమాకు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మోక్షజ్ఞ సాధారణ హీరో కాదు.. నందమూరి బాలకృష్ణ వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. దీంతో ఆయన తొలి సినిమాపై సహజంగానే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మోక్షజ్ఞను పరిచయం చేయడానికి మరింత బలమైన మాస్ ఇమేజ్ ఉన్న స్టార్ దర్శకుడిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు కొందరు అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. బాలయ్యకు ఉన్న మాస్ ఫాలోయింగ్, నందమూరి కుటుంబానికి ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని మోక్షజ్ఞను శక్తివంతమైన మాస్ కథతో ఘనంగా పరిచయం చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. దీంతో వశిష్ఠ ఎంపికపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కిన 'బింబిసార' మంచి విజయాన్ని అందుకుంది.





"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467